# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

*AUGUST - 2003*

# సత్యవాణి - టి.వి. స్పందన

జాషువా గార్కి వందనములు ప్రతిశనివారం తేజ ఛానల్‌లో దేవుని వర్తమాన సందేశములు మీరు తేటగా స్పష్టముగా మాట్లాడుచున్నారు. రిఫరెన్సులతో సహా ఎంతోచక్కగా వివరించు చున్నారు. అందు కొరకు ప్రభువునకు వందనస్తులము. సత్యవాణి కార్యక్రమం నిమిత్తం మేము ప్రతినెలా 200/- రూ॥లు కానుక పంపించుటకు తీర్మానము చేసికొని యున్నాము.

*డి. అప్పారావు, విశాఖపట్టణం.*

**సత్యవాణి వారికి, ప్రేమతో మీ అభిమానులు వ్రాయుట :**

మీరు తేజ టి.వి. ద్వారా ప్రతి శనివారం ప్రసారం చేయుచున్న కార్యక్రమమును మేము కుటుంబ సమేతముగా చూచుచున్నాము. ప్రార్థన గూర్చి ఒకసారి వివరించారు, సంగీతమును గూర్చి కూడ చెప్పారు. చాలా సంగతులు నేర్చుకొని యున్నాము. మీ టి.వి కార్యక్రమం దిన దినం అభివృద్ధి జెందాలని ప్రార్థన చేయుచున్నాము.

*జి. ధర్మారావు, రాలిపాడు, ప॥గో॥జిల్లా.*

"ప్రభువునందు ప్రియమైన బ్రదర్ జాషువా గూటం గారికి, వందనములతో వ్రాయుట : మీ టి.వి. ప్రోగ్రాం ప్రతి శనివారం తప్పక చూస్తాము. వాక్యము చక్కగా వివరించు చున్నందుకు మీకు మరియొక సారి వందనములు చెల్లించుచున్నాను".

*ఎమ్. డేనియల్ రాజు, హైదరాబాద్ - 47.*

దైవజనులు జాషువా గూటం గారికి ధన్యవాదములు. మీ టి.వి. కార్యక్రమం విడువకుండా చూస్తున్నాం. దైవశీస్సులు పొందుచున్నాము. మీరు చక్కటి తెలుగులో వాక్యం చెప్పడం వల్ల చాల బాగా అర్థం అవుతుంది.

*జయరాజు, హుజూర్ నగర్, నల్గొండ.*

"ప్రభువునందు ప్రియులైన సత్యవాణి సేవకులకు వందనాలతో వ్రాయునది: మీ టి.వి. కార్యక్రమాలు కుటుంబ సమేతముగా

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

*P.O. Box-80, Kakinada, A.P. 533 001*
*Ph : 0884 - 2363722*


**Editor :**
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*


| సంపుటిక 24 | ఆగష్టు 2003 | సంచిక 1 |
|---|---|---|


## వాక్యోపదేశము
*(Preaching the Word)*

దేవుని ఆరాధించుటకు క్రైస్తవులు కూడి రాగా అందు వాక్యోపదేశము చేయుట ఒక భాగమైయున్నది. దైవారాధనలో దేవుని వాక్యము చదివి, ధ్యానించుట మంచిది. బైబిలు పఠనము, ధ్యానము ఆరాధనలో ఒక భాగమై యున్నది. మొదటి క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" యని అపొ.కా. 2:42 చెప్పుచున్నది. అప్పటికి క్రొత్త నిబంధన గ్రంథము లిఖింపబడలేనందున మొదటి క్రైస్తవులు అపొస్తలుల ద్వారా దేవుని చిత్తమును గ్రహించుచుండిరి. ఇప్పుడైతే పరిశుద్ధాత్ముడు వారి ద్వారా వ్రాయించి యిచ్చిన గ్రంథము మనకున్నది. గనుక దేవుని చిత్తము నెరుగుటకు బైబిలును మనము పఠించవలెను. ఆరాధనకు కూడి వచ్చినప్పుడు వాక్యోపదేశమును మనము జరిగించవలెను. దేవుని చిత్తము ప్రజలకు బోధింపబడు నిమిత్తము "దేవుడు

సంఘములో మొదట కొందరిని అపొస్తలులుగాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను...... ...... నియమించెను" అని అపొస్తలుడైన పౌలు వ్రాసెను (1 కొరింథీ 12:28).

## సంఘము ద్వారా దేవుని జ్ఞానము

"దేవుడు కార్యకారియగు తన శక్తిని బట్టి నాకు అనుగ్రహించిన కృపావరము చొప్పున నేను ఈ సువార్తకు పరిచారకుడనైతిని. దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున...... ........ సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడ వలెనని ఉద్దేశించి, శోధింవశక్యముగాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవుని యందు పూర్వకాలము నుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును, పరిశుద్ధులందరిలో అత్యల్పుడైన నాకు ఈ కృప అనుగ్రహించెను" అని పౌలు ఎఫెసీ 3:7-11లో వ్రాసెను. దీనిని బట్టి సంఘము ద్వారా దేవుని జ్ఞానము, ఐశ్వర్యము ప్రకటింపబడవలెనని దేవుడు ఉద్ధేశించినట్లు మనము గ్రహించుచున్నాము.

అందువలననే యేసుక్రీస్తు, "మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని తన అపొస్తలుల కాజ్ఞాపించెను (మత్తయి 28:19, 20). అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాయుచు, "వాక్యమును ప్రకటింపుము, సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగు చేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపు తిరుగు కాలము వచ్చును" అని హెచ్చరించెను (2 తిమో 4:2-4). "నీవు అనేక సాక్షులయెదుట నావలన వినిన

సంగతులను ఇతరులకును బోధించు టకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" అని అతడు తిమోతిని వేరొక సారి హెచ్చరించెను (2 తిమో 2:2).

## ఎల్లవేళలా దేవుని వాక్యము

"దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించు టకును, ఖండించుటకును, తప్పదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజన కరమైయున్నది" (2 తిమో 3:16). అందువలన దైవవాక్కు అయిన బైబిలు గ్రంథము మానవునికి సర్వకాల సర్వావస్థల యందు అవుసరమై యున్నది. అందలి సత్యము ప్రజలకు బోధింపబడుట అత్యవసరము. బోధించువారు దానిని మరింత శ్రేష్ఠముగ ఎరుగుట ఎంతయో ప్రాముఖ్యము. అందుచే, "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత పడుము" అని అపొస్తలుడైన పౌలు హెచ్చరించు చున్నాడు. (2 తిమో 2:15).

## ఎవరు బోధింపవచ్చును ?

వాక్యమును ఎవరు బోధింపవచ్చును అని మీరడుగవచ్చును. వాక్యమును బోధించు అర్హత, అట్టి తరుణము ప్రతి క్రైస్తవునికి ఈయబడినది. మొదటి క్రైస్తవులు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి (అపొ.కా. 8:4). ప్రిస్కిల్ల, అకుల యనువారు అపొల్లోయను ఒక యూదుని చేర్చుకొని దేవుని మార్గమును మరి పూర్తిగ అతనికి విశదపరచిరి (అపొ.కా. 18:26). అపొస్తలుడైన పౌలు హెబ్రీయు లనుద్దేశించి, "కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండ వలసినవారై యుండగా, దైవో క్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను" అని వారిని మందలించెను (హెబ్రీ 5:12). మనము ఇప్పటివరకు చూచిన వాక్యములను బట్టి క్రైస్తవులయిన పురుషులు, స్త్రీలు వాక్యమును బోధింపనర్హత గలవారు అని గ్రహించి యుంటిమి.

# సంఘములో స్త్రీ

అయితే సంఘములో స్త్రీలు బహిరంగముగా బోధించుటను పరిశుద్ధాత్ముడు నిషేధించెను. అందు విషయమై పౌలు 1 కొరింథి 14:34-36లో ఇట్లు వ్రాయుచున్నాడు: "స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను. వారు లోబడి యుండవలసినదే గాని, మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. వారు ఏమైనను నేర్చుకొనగోరిన యెడల, ఇంట తమ తమ భర్తల నడుగవలెను; సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము". 1 తిమోతి 2:11-12లో, "స్త్రీలు మౌనముగా ఉండి, సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని, ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" అని పరిశుద్ధాత్ముడు పలికెను. గనుక ఆరాధన సమయములో పురుషులుండగా స్త్రీలు వాక్యమును బోధించుట వాక్యవిరుద్ధమని గమనింతము.

దేవుడు తన సంఘములో స్త్రీలకు తగిన ప్రాధాన్యత నిచ్చెను. స్త్రీలు బహిరంగముగా గాక, వ్యక్తిగతముగా బోధింపవచ్చునని అకుల, ప్రిస్కిల్ల యను దంపతుల నుండి మనం నేర్చుకొంటిమి (అపొ.కా. 18:26). స్త్రీలు తమ బిడ్డలకు వాక్యమును బోధింపవలెను. బాలుడు నడువవలసిన త్రోవను తల్లులు చిన్ననాడే నేర్పినయెడల, అతడు వృద్ధుడైనను దాని నుండి తొలగిపోడు అని వాక్యము బోధించుచున్నది. గనుక ఈనాటి మన బిడ్డల ఆత్మీయ జీవితము వారి తల్లులపై ఎక్కువ ఆధారపడి యున్నదని గమ నింతము. అటువలెనే వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీలకు బోధించవలెనని వాక్యము చెప్పుచున్నది (తీతు 2:4). స్త్రీలు సత్యవాక్యమును సరిగ ఎరిగినవారును, దాని ప్రకారము నడుచుకొను వారైన యెడల తమ తమ బిడ్డలను, భర్తలను దేవుని మార్గమున నడిపించు శక్తిగలిగిన వారిగ దేవుడు వారికి గృహము నందు అట్టి ప్రాధాన్యత నిచ్చెను. "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషు లకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ ప్రవర్తనను చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్టబడవచ్చునని" అపొ. పేతురు వ్రాసెను (1 పేతు 3:1-2).

# ఎందుకు బోధించాలి ?

దేవుని వాక్యమును మనము ఎందుకు బోధించవలెను? "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది". 'నీ వాక్యములు వెల్లడి యగుట తోడనే వెలుగు కలుగును. అవి తెలివి లేనివారికి తెలివి కలిగించును" అని దావీదు మహారాజు వ్రాసెను' (దా.కీ. 119: 105, 130). యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని మనము నమ్ము నిమిత్తము, నమ్మి ఆయన నామమందు మనము జీవము పొందు నిమిత్తము లేఖనములు ప్రకటింపబడవలెను (యోహాను 20:30-31). ప్రకటింపబడిన వాక్యమును వినుట ద్వారా విశ్వాసము కలుగునని రోమా 10:17 చెప్పుచున్నది. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి........ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" అని పౌలు చెప్పుచున్నాడు (రోమా 1:16). "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయు నని" యేసు చెప్పెను (యోహా 8:31-32).

మానవులను పాపపు బానిసత్వము నుండి విడుదల చేయునది దేవుని వాక్యము. అజ్ఞానంధ కారముల నుండి జ్ఞానమునకు, వెలుగునకు నడుపునది దేవుని వాక్యము. యేసుక్రీస్తు తన వాక్యము ద్వారా ఇచ్చు రక్షణ నీవు తిరస్కరించిన యెడల అంత్యదినమందు నీకు తీర్పు తీర్చునట్టిది దేవుని వాక్యము. ఆయన ఇట్లు చెప్పుచున్నాడు: "ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నేనతనికి తీర్పు తీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని రక్షించుటకే వచ్చితిని. నన్ను నిరాకరించి నా మాటలను అంగీ కరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు అతనికి తీర్పు తీర్చును" (యోహా 12:47-48). అంత్య దినమందు జరుగబోవు తీర్పును భక్తుడైన యోహాను ఇట్లు వర్ణించెను "మరియు గొప్పవారేమి, కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్నవాటిని బట్టి తమ క్రియలచొప్పన

మృతుల తీర్పుపొందిరి....... ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడనియెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రక 20:12-15).

నీపేరు జీవగ్రంథములో వ్రాయబడవలెనని దేవుని గొర్రె పిల్లయగు యేసుక్రీస్తుని రక్తములో నీ పాపముల నుతుకుకొనుము. యేసు నందు విశ్వాసముంచి, ఆయన నామమున బాప్తిస్మము పొందుట ద్వారా అది ఈనాడే నీకును సాధ్యమగును.

❋ ❋ ❋

# నేనెవని పంపెదను ?

*(Whom shall I send ?)*

క్రీస్తు పూర్వము 740లో యెషయా జీవితమును మార్చివేసిన ఒక ప్రశ్నను దేవుడడిగెను. అది యెషయా 6:8లో ఇట్లున్నది: "నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవును?". పాపములో నశించిపోవు చున్నవారికి సువార్తను చాటించాలనే ఆసక్తిగల దేవుని ప్రజలకు ఈ ప్రశ్న ఈనాడును వర్తించును. ఈ లేఖన భాగాన్ని కొంతలోతుగా ఆలోచిద్దాం.

మొదటిగా, దేవుని పిలుపు ప్రతి క్రైస్తవునికి వర్తించును. ఈ లోకమును దేవుడు ప్రేమించుచున్నాడని మనమెరుగుదుము. మనుష్యు లందరు రక్షింపబడి సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము కలిగి యుండాలని ఆయన కోరుచున్నాడు (1 తిమో 2:4). అందరు మారు మనసు పొందవలెనని ఆయన కోరుచున్నాడు (2 పేతురు 3:9). నశించిన వారిని రక్షించుటకు ఆయన తన కుమారుని సిలువపై బలియిచ్చారు. (యోహాను 3:16, 4:42). మానవుల ఆత్మల రక్షణ నిమిత్తము త్రియేక దేవునిలో ముగ్గురు మూర్తులు తమ ప్రేమను వెల్లడించారు.

## నీవు, నేను వెళ్లాలి

నశించిన వారియెడల దేవునికున్న ప్రేమను బట్టి యెషయా 6:8లోని ప్రశ్ననేటికిని మన చెవులలో గింగురుమనుచున్నది. సువార్త ప్రకటించడానికి నీవు, నేను వెళ్లకపోతే ఎవరు వెళ్దుదురు? "నీవు కాకపోతే ఇంకెవరు? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?". బోధకులు మాత్రమే లోకమంతా సువార్త చాటలేరు. "కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" యని బైబిలు చెప్ప చున్నది. (అపొ.కా. 8:4). ఆ చెదరిపోయిన వారు సామన్య క్రైస్తవులు. ఏలయనగా ఆ సందర్భములో అపొస్తలులు యెరూషలేములో యుండిరి. "స్తెఫను విషయములో కలిగిన శ్రమను బట్టి చెదరిపోయినవారు యూదులకు తప్ప మరి ఎవరికిని వాక్యము బోధింపక ఫేనీకే, కుప్ర, అంతియొకయ ప్రదేశముల వరకు సంచరించిరి. కుప్రేయులు కొందరును కురేనీయులు కొందరును వారిలో ఉండిరి. వీరు అంతియొకయకు వచ్చి గ్రీసుదేశపు వారితో మాటలాడుచు ప్రభువైన యేసును గూర్చిన సువార్త ప్రకటించిరి. ప్రభువు హస్తము వారికితోడైయుండెను గనుక నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి" (అపొ.కా. 11:19-21). ప్రతికీలును శరీరమునకు బలము కలుగజేయాలి (ఎఫెసీ 4:16). అంటే సంఘములో మనందరికీ పనియున్నది. మనందరము సువార్త వ్యాప్తి చేయగలము.

## స్వనీతి పరులు కాకూడదు

రెండవదిగా, దేవుని పిలుపునంగీకరించేవారి లక్షణములను కొన్నిటిని గమనించుదాం. మొదటిగా మారుమనసు కావాలి. "అయ్యో నేను అపవిత్రమైన పెదవులు గలవాడను, అపవిత్రమైన జనుల మధ్యను నివసించువాడను, నేను నశించితిని" యని యెషయా పలికెను (యెషయా 6:5). పరిశుద్ధుడైన పరలోక దేవునితో తాను పోల్చుకొని నప్పడు ప్రవక్త యొక్క నిజస్థితి గోచరమయ్యింది. అతడు బ్రద్ధలై పోయాడు. పాపము వలన కలుషితము చేయబడినవాడని తానెరు గును. యేసుప్రభువు సన్నిధిలో పేతురు కూడా అట్లే భావించాడు. "అతడు యేసు మోకాళ్ల యెదుట సాగిలపడి - ప్రభువా, నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ముడనని చెప్పెను" (లూకా 5:8).

నీవు ఎప్పుడైనా ఈలాగు తలంచావా? "మేమందరము అపవిత్రులవంటి వారమైతిమి. మా నీతిక్రియలన్నియు మురికిగుడ్డవల నాయెను" అని యెషయా 64:6 చెప్పుచున్నది. వృద్ధుడైన బోధకుడొకడి ట్లనెను: "నా ఆత్మరక్షణను గూర్చి ఆలోచించకముందు నా పాపములు స్వల్పమైనవేయని అనుకొన్నాను. నా పాపములన్నియు మృతములై పాతిపెట్టబడి ఎవరికిని జ్ఞప్తిలో యుండవనుకొన్నాను. అయితే మారుమనస్సును గూర్చిన బూరధ్వని నిత్య సంగతులను గూర్చి వినిపించి నా పాపములన్నిటికిని పునరుత్థానము కలుగజేసెను. అయ్యో, అవి తిరిగిలేచి సముద్ర యిసుకరేణువుల కంటే విస్తారమాయెను. ఇప్పుడు నా తలంపులే నన్ను నాశనమునకు పంపుటకు చాలు, నా మాటలే పాతాళము కంటే దిగువగా నన్ను పంపును, నా పాపముల దుర్వాసన నా నాసికా రంధ్రములో యున్నది, దానిని నేను భరించలేను". ఇట్టి పరిస్థితిలో మనందరం ఏదో ఒక సమయంలో లేకపోలేదు.

దేవుని పిలుపు నంగీకరించువారిలో ఒప్పుకోలు కనబడును. తాను అపవిత్రమైన పెదవులు గలవాడని యెషయా ఒప్పుకొనెను. (యెషయా 6:5). అతడు అపవిత్రమైన నోరు గలవాడై కూడ యుండ వచ్చును. వదరుబోతును, అబద్ధమూలాడువాడైయుండవచ్చును. అయితే పాపమును ఒప్పుకొనునప్పుడు ప్రత్యేకముగా దాన్నిగూర్చి అతడు ప్రస్తావించుట గమనించుము. నేను పాపము చేసానని ఒప్పుకొనడం సులభమే. అయితే ఏ పాపము చేసాడో ఒప్పుకొనుట కష్టము! తాము చేసిన పాపమును ప్రత్యేకముగా ఒప్పుకొన్నవారినెందరిని నీవెరుగుదువు? యెషయా 6:8లో యున్న పిలుపును అంగీకరించు వారు దేవునిచే వాడబడకముందు తమ పాపములను ప్రత్యేకముగా ఒప్పుకొన్నవారై యుంటారు.

## మార్పు జెందాలి

దేవుని పిలుపు నంగీకరించువారు చింత కలిగియుంటారు. "అపవిత్ర మైన పెదవులు గలవారి మధ్య నేను నివసించుచున్నాను" అని యెషయా పలికెను. వారి హృదయస్థితిని వారి నోరు బయలు పరచెనని అతడెరుగును. "హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడునని" యేసు

చెప్పెను (మత్తయి 12:34).

సువార్త కొరకు దేవుని పిలుపును వినినవారు మార్పు జెందిన వారై యుందురు. యెషయా 6:6-7లో ఇట్లున్నది: "అప్పుడు ఆ సెరాపులలో నొకడు తాను బలిపీఠము నుండి కారుతో తీసిన నిప్పును చేతబట్టుకొని నా యొద్దకు ఎగిరివచ్చి, నానోటికి దాని తగిలించి, ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్త మాయెను, నీ దోషము తొలగిపోయెననెను". మనము మొదట మారితేనేగాని, పాపములోబడి నశించుచున్న వారిని మార్చలేము !

## ప్రతిష్ఠించుకోవాలి

చివరిగా, దేవుని పిలుపు నంగీకరించువాడు ప్రతిష్ఠించు కొనవలెను. "చిత్తగించుము, నేనున్నాను, నన్నుపంపుమని" యెషయా పలికెను (యెషయా 6:8). నన్ను కాదు ఇంకొకరిని పంపుమని అతడనలేదు. ఇదిగో డబ్బు, ఒక మిషనెరీని పంపుమని అతడనలేదు. ఒక స్త్రీ దేవుడు అనేక మిషనెరీలను పంపాలని ప్రార్థించేది. అయితే తన కుమారుడే మిషనెరీగా వెళ్తాననేసరికి అతడు వెళ్లకుండా సర్వప్రయత్నాలు చేసింది! మరొక స్త్రీ తన భర్త మారి క్రైస్తవుడు కావాలని ప్రార్థించేది. అతడు చివరకు క్రైస్తవుడై మిషనెరీగా వెళ్దామనుకొనేసరికి ఆమె సృష్టించిన గందరగోళం ఇంతా అంతా కాదు!

మన పాఠంలోని ప్రశ్నకు నీవెట్లు స్పందించావు? "ఎవరు, నేనా? నేనేమి చేయగలను?" అని అనుకొన్నావా? ఒకాయన ఇట్లు వ్రాసాడు. "నేనొక్కడినే, గాని నేనొకడిని; నేను ప్రతీదీ చేయలేను గాని నేనేమి చేయవలెనో దాన్ని చేయాలి; నేను చేయగలిగింది దేవుని కృప వలన తప్పక చేస్తాను".

నేనెవని పంపుదును? మా నిమిత్తము ఎవడు పోవును? దేవుడు ఈ ప్రశ్న నేటికిని అడుగుచున్నారు. నీవు దానికి జవాబిత్తువా?

- జాన్ స్టేసి

* * *

ఉపమానమాలిక :

# నా పొరుగు వాడెవడు?

## *(Who is my Neighbour ?)*

ఒకప్పుడు ధర్మ శాస్త్రోపదేశకుడొకడు యేసునొద్దకు వచ్చి నా పొరుగు వాడెవడని ఆయన నడిగాడు. "అందుకు యేసు ఇట్లనెను: ఒక మనుష్యుడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని, అతని కొట్టి కొరప్రాణముతో విడిచి పోయిరి. అప్పుడొక యాజకుడు ఆ త్రోవను వెళ్లుట తటస్థించెను. అతడు అతనిని చూచి ప్రక్కగా పోయెను. అలాగుననే లేవీయుడొకడు ఆ చోటికి వచ్చి చూచి ప్రక్కగా పోయెను. అయితే ఒక సమరయుడు ప్రయాణమై పోవుచు, అతడు పడియున్న చోటికి వచ్చి అతనిని చూచి అతనిమీద జాలిపడి దగ్గరకుపోయి నూనెయు ద్రాక్షారసమును పోసి అతని గాయము లను కట్టి, తన వాహనము మీద ఎక్కించి యొక పూట కూళ్లవాని యింటికి తీసికొని పోయి అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్ల వాని కిచ్చి - ఇతని పరామర్శించుము; నీవింకేమైనను ఖర్చు చేసిన యెడల నేను మరల వచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పి పోయెను. కాగా దొంగల చేతిలో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవడు పొరుగు వాడాయెనని నీకు తోచుచున్నది అని యేసు అడుగగా అతడు అతని మీద జాలిపడిన వాడే అనెను. అందుకు యేసు నీవును వెళ్లి అలాగు చేయుమని అతనితో చెప్పెను" (లూకా 10:28-37).

యేసు చెప్పిన ఈ ఉపమానాన్ని మంచి సమరయుని కథ యని మనం చెప్పకొంటాము. ధర్మశాస్త్రోపదేశకుడు లేచి నిత్య జీవమునకు వారసుడగుటకు నేనేమి చేయవలెనని యేసు నడిగాడు. ఇతడడిగిన ప్రశ్నను బట్టి యేసు ఈ ఉపమానాన్ని చెప్పాడు. ఈ ఉపమానములో మనకు పలు వ్యక్తులు కనబడు చున్నారు.

మొదటిగా ధర్మశాస్త్రోపదేశకుడు మనకు కనబడుచున్నాడు. నిత్య జీవమును గూర్చిన ప్రశ్న వేయగానే యేసు, ధర్మశాస్త్రమందేమి వ్రాయబడి

యున్నది? నీవేమి చదువుచున్నావని అడిగారు. అతడు ధర్మశాస్త్రాన్ని బోధించేవాడు; దానినెరిగియున్నట్లు యేసుకు జవాబిచ్చాడు, అందుకు యేసు ఈ ఉపమానము చెప్పి నీవును వెళ్లి అలాగు చేయుమని చెప్పారు. ఇంకో మాటలో ధర్మశాస్త్రమందలి నీ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టు; ఉపదేశించడమేగాక, దాన్ని ఆచరించు అని ఆయన చెప్పారు. మరల అతడే, నా పొరుగు వాడెవడు అని ప్రశ్నించాడు. యేసును ప్రశ్నలు వేసి తడబడే లాగున చేద్దామను కొన్నాడు. నిత్యజీవాన్ని తన సొంత మార్గములో పొందాలని అనుకొన్నాడు. అతడొక పండితుడు. గాని అతనికున్న సంకుచిత స్వభావము వలన అందరినీ ప్రేమించలేక పోయాడు. ఈర్ష్య వలన ప్రేమ చల్లబడిపోతాది. యేసు మంచి సమరయుని ఉపమానము చెప్పగానే అతని అంతరాత్మ కొంచెం కదలించ బడింది, గాని క్రీస్తు మార్గం అతనికి అక్కరలేకపోయింది. దొంగల చేతిలో చిక్కిన వాని పొరుగువాడెవడు? అని యేసు ప్రశ్నించగా, 'సమరయుడు' అని చెప్పడానికి అతనికింకా మనస్సు ఒప్పలేదు. అందువలన 'అతనిమీద జాలిపడిన వాడేయని ఒప్పకొన్నాడు.

ఈ ధర్మ శాస్త్రోపదేశకుని వలె అనేకులు తాము నీతి మంతులుగా కనబడడానికి మాత్రమే, నాపొరుగు వాడెవడు? అని ప్రశ్నిస్తారు. అది మంచి మనస్తత్వం కాదు.

## పాపం దోచుకొంటాది

రెండవదిగా, దొంగల చేతిలో చిక్కినవాడు మనకు ఈ ఉపమానములో కనబడుచున్నాడు. అతడు యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు దొంగల చేతిలో చిక్కాడు. యెరూషలేము నుండి యెరికోకు 18 మైళ్ల దూరము. మరియు 3500 అడుగులు క్రిందికి రావాలి. అతడు దొంగల చేతిలో చిక్కాడు. వారతని బట్టలు దోచుకొన్నారు, కొట్టి కొరప్రాణముతో విడిచి పెట్టారు. ఇది పాపములో చిక్కుకొనిన వాని పరిస్థితి. పాపము చేయువాడు పవిత్ర స్థితినుండి పాపములోనికి, క్రిందికి పడతాడు - పాపము అతని పవిత్ర విలువలన్నీ దోచుకొంటాది, పనికిరాని వానివలె కొరప్రాణముతో విడిచిపెడతాది.

మూడవదిగా, మనకు ఒక యాజకుడు ఆ త్రోవను వెళ్లుచు

కనబడుచున్నాడు, అతడట్లు వెళ్లుట తటస్థించినది. ఇక్కడొక మనుష్యుడు అత్యవసర పరిస్థితిలో పడియున్నాడు; అతనికి సహాయం అవుసరం. సహాయం చేయగల మానవుడా మార్గాన్న వెళ్లుట తటస్థించినది. దేవుడు మనకు సహాయం చేసే విధానమిది, గాని సహాయం చేయగల మానవుడొక వ్యర్థుడయ్యాడు. అతడతని చూచి ప్రక్కగా పోయాడు. అతడు యాజకుడు: అతని ఆరాధనను క్రియాత్మకంగా తర్జుమా చేయవలసిన అవుసరం ఎంతైనా యున్నది. అందులోను, అతడు కూడ ఆదేమార్గమున ప్రయాణించుచున్నాడు. అదేగతి అతనికి పట్టదని ఎక్కడున్నది? ఆపదలో యున్న వానిని ఆదుకొనక పోయినందున అతడు ధర్మశాస్త్రమును అతిక్రమించాడు (నిర్గమ 23:4, 5).

నాలుగవదిగా, లేవీయుడు మనకు కనబడుచున్నాడు. అతడా చోటికి వచ్చి చూచి ప్రక్కగా పోయాడు. ఇతడు దేవుని ఆలయములో పరిచర్య చేయువాడు. అయినను పైన చెప్పకొనిన యాజకునివలె సాకులు చెప్పకొనుచు పరిచర్య చేయక తప్పించుకొన్నాడు.

## కార్యసాధకమైన ప్రేమ

చివరిగా మనకొక సమరయుడు కనబడుచున్నాడు. ఇతడు యూదులవలన ద్వేషింపబడినవాడు. బహుశ దొంగల చేతిలో పడినవాడు యూదుడై యుండవచ్చును. అతనికంటే ముందు ఆ మార్గమును వెళ్లిన యాజకుడు, లేవీయుడు గాయపడిన వాని జోలికే పోలేదు. వారి వలెనే ఈ సమరయుడు కూడ సాకులు చెప్పవచ్చును. గాని అతడు పడియున్న చోటికి వచ్చి, అతనిని చూచి, అతనిమీద జాలిపడి, దగ్గరకు పోయి నూనెయు ద్రాక్షారసమును పోసి అతని గాయములను కట్టి తన వాహనముమీద యెక్కించి యొకపూట కూళ్లవాని యింటికిపోయి అతని పరామర్శించాడు.

తనలో కార్యసాధకమైన ప్రేమను అతడు చూపించాడు. అతడు కనీసం పది సంగతులు చేసి అతనికి సహాయపడ్డాడు. పరిచర్య చేయు నిమిత్తం అతడు తన కండ్లను, హృదయాన్ని, శరీరాన్ని, చేతులను, కాళ్లను, సమయాన్ని, ధనాన్ని చివరకు తన వాహనాన్ని వినియోగించాడు. కనికరం చూపించాడు, బోధించడమే కాదు, ఆచరించాలని నిరూపించాడు.

## ఆపదలో ఆదుకొన్న వాడే

ఈ ముగ్గురిలోను దొంగల చేజిక్కినవానికి పొరుగువాడె వడు? ఎవడైతే ఆపదలో యున్న వానిని అదుకొన్నాడోవాడు. నీపొరుగువాడెవడు? ఎవరు క్రీస్తు సువార్త యొక్క అవుసరత కలిగి యున్నారో వారు; ఎవరు పాపములో చిక్కుబడి యున్నారో వారు. వారి అవుసరతను చూడండి, జాలి చూపించండి, సువార్త చాటి క్రీస్తు నొద్దకు వారిని తీసికొని రండి. పాపములోనికి దిగజారకండి, క్రీస్తును వెంబడించండి.

- జాషువా గూటం

❋ ❋ ❋

## మనందరం పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందెదమా ?

*(De we all receive the Baptism of the Holy Spirit ?)*

ప్రభువు సువార్తకు లోబడు వారందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలెనని (లేకపొందుదురని) కొందరు భావిస్తారు. దానిని నమ్ముచు అపొస్తలులవలె వీరుకూడ అద్భుతములు చేయు శక్తిని దానివలన పొందుదురను కొంటారు. యిది యదార్థమని నమ్మించుటకు అపొ.కా. 1:15లో చెప్పబడిన 120 మంది పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందారని వారు చెబుతారు. అందువలన దయచేసి దిగువనీయబడిన ప్రశ్న జవాబులను గమనించ మనవి:

**1. యేసు ఈలోకమును విడిచి పెట్టక ముందు ఆదరణ కర్తను ఎవరికి వాగ్దానము చేసెను?**

జవాబు: అపొస్తలులతో మాట్లాడుచు యేసు ఇట్లు చెప్పెను: "తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త, అనగా తండ్రి యొద్ద నుండి బయలు దేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను

గూర్చి సాక్ష్యమిచ్చును. మీరు మొదట నుండి నా యొద్ద ఉన్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:26-27). పైనుదహరించిన 120మందిలో ప్రతివాడు మొదట నుండి ఆయన యొద్ద లేరు. మరల ఆయన పరమున కారోహణుడు కాకముందు ఒలీవ కొండపై ఆయనతో కూడనున్న 11 మంది అపొస్తలులతో "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందు వరకు పట్టణములో నిలిచియుండుడని వారితోచెప్పెను" (లూకా 24:29; అపొ.కా. 1:8).

**2. అపొ.కా. మొదటి అధ్యాయములో చెప్పబడిన 120 మంది పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరా?**

జవాబు: అపొ.కార్యములు మొదటి రెండు అధ్యాయములు చదువుచుండగా, అపొస్తలులపైనే ఆ సంఘటనలు కేంద్రీకృతమైనట్లు గమనించగలము. ఆదిలో బైబిలు అధ్యాయములు వచనములుగా విభజింపబడలేదు. అపొ.కా. 1:26లో ఇస్కరియోతు యూదా స్థానమును మత్తీయ భర్తీ చేసినట్లు తెలిసికోగలము. "మత్తీయ పేరట చీటి వచ్చెను గనుక అతడు పదనొండు మంది అపొస్తలులతో కూడ లెక్కింపబడెను. పెంతెకోస్తును పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వారు కూర్చుండి యున్న యిల్లంతయు నిండెను............అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మవారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాట్లాడ సాగిరి" (అపొ.కా. 2:1-4).

వారు వివిధ భాషలతో మాట్లాడుట విని ప్రజలు విభ్రాంతి నొంది ఆశ్చర్యపడి ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా? యని అడిగారు (2:7). ఆ 120మందిలో అందరు గలిలయులు కారు గాని అపొస్తలుందరూ గలిలయులే. పరిశుద్ధాత్మ బాప్తిస్మము వారికే వాగ్దానము చేయబడెను. అద్భుత రీతిగా వారే దానిని పొందిరి.

**3. అపొ.కా. 2:38లో చెప్పబడిన పరిశుద్ధాత్మ అను వరము అద్భుత రీతిగా నున్న పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదా?**

జవాబు: కాదు, సరిగదా ఎవరైతే లేఖనముల ప్రకారమైన బాప్తిస్మము పొందుతారో వారిలో ఆత్మీయ జీవం పునరుద్ధరింపబడడమే అది (అపొ.కా. 5:32). అది అద్భుతములు చేసే శక్తి కాదు.

4. పెంతెకోస్తునాడు విశ్వసించిన వారందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది పిమ్మట అద్భుతములు చేయగల్గిరి యని కొందరు నమ్ముదురు. అట్లయితే అపొ.కా. 6:3-6లో ఏర్పరచు కొనబడిన ఏడుగురు అద్భుత శక్తి పొందునట్లు అపొస్తలులు వారిపై ఎందుకు చేతులుంచవలసి వచ్చినది?

జవాబు: నిజానికి అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరి. మిగతావాళ్లందరు నీటిలో బాప్తిస్మము పొంది తమలో నివసించు పరిశుద్ధాత్మ అనువరమును పొందిరి. అపొస్తలులు మాత్రమే అద్భుతములు చేయుశక్తి కలిగి యుండిరి. అపొ.కా. 1:15లో చెప్పబడిన 120 మంది గాని, 2:41లో చెప్పబడిన మూడు వేలమంది గాని అపొస్తలుల వలె పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందలేదు.

అయినను అపొ.కా. 6:1-8లో పరిచర్య చేయు నిమిత్తము మంచి పేరుపొందిన ఏడుగురు పురుషులను ఏర్పరచు కొనవలెను చెప్పినప్పుడు వారు ఆత్మతోను జ్ఞానముతోను నిండుకొని యుండాలని అపొస్తలులు విధించిరి. అంటే అపొ.కా. 2:38లో చెప్పబడిన పరిశుద్ధాత్మ అనువరమును వీరు పొంది యుండిరి. అది అద్భుతములు చేయు వరముకాదు, అయితే ఈ 7గురు మీద అపొస్తలులు చేతులుంచిన తరువాత మాత్రమే వారు అద్భుతములు చేయగల్గిరి (అపొ.కా. 6:8; 8:5-6).

5. ఈనాడు క్రీస్తునందున్న విశ్వాసులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదురా?

జవాబు: లేదు. ఏలయనగా ఆ ప్రత్యేక బాప్తిస్మము అపొస్తలులకు మాత్రమే వాగ్దానము చేయబడెను. వారు యూదులు. మరియు కొర్నేలియు అతని యింటివారును పొందిరి. వారు అన్యజనులు. ఈ రెండు సందర్భములు తప్ప మరేమీ లేఖనములలో వ్రాయబడలేదు. అపొస్తలులు కొందరిని ఏర్పరచి


వారిమీద చేతులుంచి అద్భుత వరములు ఈయువచ్చును గాని, చేతులుంచబడిన వారు ఇంకొకరికి ఆశక్తిని బదలాయించలేరు (అపొ.కా. 6:6; 8:14-17).

తద్వారా పరిశుద్ధాత్ముడు అద్భుత రీతిగా చేయు పని సంఘము యొక్క బాల్యదశకు, మొదటి శతాబ్దమునకు మాత్రమే పరిమితము చేయబడినది. క్రొత్త నిబంధన లేఖనములు వ్రాయబడుచుండగా అపొస్తలులు ద్వారా జరుగుచున్న అద్భుతముల వలన అవి స్థిర పరచబడెను (హెబ్రీ 2:2).

### 6. ప్రజలు నేడు బాప్తిస్మ పొందినప్పుడు ఏమి పొందుదురు?

**జవాబు:** మనం బాప్తిస్మము పొందినప్పుడు అపొ.కా. 2:38 ప్రకారము పాపక్షమాపణను, పరిశుద్ధాత్మ అనువరమును పొందుదుము. అది అద్భుత శక్తికాదు. నేడు అద్భుత శక్తి మనము ఎందుకు పొందము? ఏలయనగా మనలను నడిపించుటకు స్థిర పరచబడిన వాక్యము నేడు మనకున్నందున పొందము (మార్కు 16:16; యోహాను 20:30-31). అద్భుతముల ద్వారా గాక, వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17).

- జె.సి. చోట



సంక్షిప్త ప్రసంగము:

# దేవుని ఎందుకు ఆరాధించాలి ?

*(Why Worship God ?)*

కీర్తనలు 95

**పరిచయము :**

- మానవుడు ఆది నుండీ ఆరాధించేవాడే.
- ఆదాము హవ్వలు, కయీను హేబేలులు ఉదాహరణలు.
- మనం దేవుని ఆరాధించాలని ఆజ్ఞాపింపబడితిమి (ప్రకటన 22:9; అపొ.కా. 14:15; యోహాను 9:31).
- మూడు రకములైన ఆరాధనలను గూర్చి క్రొత్త నిబంధన చెప్పచున్నది :

1. వ్యర్థారాధన : మత్తయి 15:9
2. తెలియని ఆరాధన : అపొ.కా. 17:23
3. సత్యారాధన యోహాను : 4:24

**మనం దేవుని ఆరాధించడానికి 4 కారణాలు : కీర్తన 95**

A. ఆయన దేవతలందరికి పైన మహోత్యము గలవాడు : (95:3)

1. ఆయన మానవుని కంటె ఉన్నతుడు.

   అపొ.కా. 10:25, 26, 34, 35; యెషయా 55:7-9

2. ఆయన దూతల కంటె ఉన్నతుడు. ప్రక 22:9.
3. దేవుడొక్కడు మాత్రమే ఆరాధనీయుడు.

   ప్రక 4:5; I రాజులు 20; 18:17-39; I సమూ 5:1-6

B. ఆయన సమస్తానికి సృష్టికర్త (95:4-5)

1. దేవుడు లోకాన్నంతటినీ సృజించెను (ఆది.కా. 1;2); (యోహా 1:1-3).
2. దేవుడు ఈలోకాన్ని 6 రోజులలో సృజించెను (నిర్గ 20:11).

3. ఆయన సమస్తమును సృష్టించిన దేవుడు (ప్రక 4:11).

4. ఆయన అందరికి జీవమును ఊపిరిని సమస్తమును దయ చేయు వాడు (అపొ.కా. 17:25).

5. ఆయన నమ్మకమైన సృష్టికర్త (1 పేతురు 4:19).

C. ఆయన మంచి గొర్రెల కాపరి (95:6-7)

1. యెహోవా నా కాపరి (కీర్తన 23).

2. ఆయన మంచి గొర్రెల కాపరిగా వర్ణించబడెను (యోహా 10:1-18).

3. ఆయన గొర్రెల గొప్ప కాపరి యని చెప్పబడెను (హెబ్రీ 13:20).

4. ఆయన మన ఆత్మల కాపరి, అధ్యక్షుడు (1 పేతు 2:25).

D. దేవుని వాక్యమును నిర్లక్ష్యము చేసినందున ఒక తరము వారంతా కానాను కోల్పోయిరి (95:8-11).

1. యూదులు అరణ్యములో 40 సంవత్సరములు ప్రయాణము చేసిరి. మొదట బయలు దేరిన వారిలో ఇద్దరు తప్ప అందరు మరణించిరి.

2. సంఖ్యాకాండము 14:29-34 చదువుము

3. దీనిని పోలు మనకొక ఉదాహరణగా చూపించెను (1కొరింథీ 10:1-12).

ముగింపు :

పైన చెప్పబడిన కారణములను బట్టి మనందరం యెహోవా దేవుని ఆరాధింప బాధ్యులం.

ఆయనను విడిచి పెట్టి వేరే దేవుండ్లను, దేవతలను ఆరాధింప రాదు.

ఆయనే నిజ దేవుడు.

- మేక్స్ పేటర్సన్

❋ ❋ ❋

# బైబిలు గూర్చి కొన్ని విషయాలు

| | |
|---|---|
| 1. పరిశుద్ధ గ్రంథములోని మొత్తము పుస్తకములు | 66 |
| 2. పాత నిబంధన గ్రంథములోని మొత్తము పుస్తకములు | 39 |
| 3. క్రొత్త నిబంధన గ్రంథములోని మొత్తము పుస్తకములు | 27 |
| 4. పాత నిబంధన గ్రంథములోని మొత్తము అధ్యాయములు | 929 |
| 5. క్రొత్త నిబంధన గ్రంథములోని మొత్తము అధ్యాయములు | 260 |
| 6. మెత్తము పరిశుద్ధ గ్రంథములోని అధ్యాయములు | 1189 |
| 7. పరిశుద్ధ గ్రంథములోని వచనములు | 31173 |
| 8. పరిశుద్ధ గ్రంథములోని మాటలు | 773746 |
| 9. పరిశుద్ధ గ్రందములోని అక్షరములు | 35,67,180 |
| 10. బైబిలులోని పెద్ద అధ్యాయము - దావీదు కీర్తనలు | 119 |
| 11. బైబిలులోని చిన్న అధ్యాయము - దావీదు కీర్తనలు | 117 |
| 12. బైబిలులోని పొడవైన వచనము - ఎస్తేరు | 8:9 |
| 13. బైబిలులోని చిన్న వచనము - యోహాను | 11:35 |
| 14. బైబిలులోని మధ్య వచనము - కీర్త | 118:8 |
| 15. పాత నిబంధన గ్రందములోని మధ్య అధ్యాయము యోబు | 29 |
| 16. క్రొత్త నిబంధన గ్రంథములోని మధ్య పుస్తకము - | 2 థెస్స. |
| 17. క్రొత్త నిబంధన గ్రంథములోని మధ్య అధ్యాయము - రోమా | 13 |

18. పరిశుద్ధత అను మాట పాత నిబంధనలో 830 సార్లు ఉన్నది.

19. పరిశుద్ధత అను మాట క్రొత్త నిబంధనలో 250 సార్లు ఉన్నది.

- గుంటు నెహెమ్యా కుమార్, తర్లుపాడు.

# T.V. లో క్రీస్తు సంఘ కార్యక్రమములు

**తెలుగు:**

ప్రతి బుధవారం ఉదయం 7:00 గంటలకు కాకినాడ సిటీకేబుల్
ప్రసంగీకులు : T.V.N. కుమార్

ప్రతి గురువారం ఉదయం 7:00 గంటలకు కాకినాడ సిటీకేబుల్
ప్రసంగీకులు : జాషువా గూటం

ప్రతి శుక్రవారం ఉదయం 7:30 గంటలకు మాటివీ
ప్రసంగీకులు : బొంతు ధనరాజు

ప్రతి శనివారం : ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్
ప్రసంగీకులు : జాషువా గూటం

**ఇంగ్లీషు-హిందీ :**

ప్రతి బుధవారం సాయంత్రం 6:30 గంటలకు - Miraclenet
ప్రసంగీకులు : సన్నీ డేవిడ్

**తమిళం :**

ఆదివారం ఉదయం 7:00 గంటలకు - **Tamil T.V.**
ఆదివారం రాత్రి 10:00 గంటలకు - **Star Vijay**
సోమవారం ఉదయం 6:00 గంటలకు - **Raj T.V.**
మంగళవారం ఉదయం 7:00 గంటలకు - **S S Music**
ప్రసంగీకులు: పీటర్ సోలొమోన్

---

గమనిక : సత్యవాక్కు వలయువారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

Satya Vani, P.O.BoX - 80, Kakinada - 533 001.

---

చూస్తున్నాము. దీనివలన మేం ఆధ్యాత్మిక దీవెనలు పొందుచున్నాము. మీరు చేయుచున్న పరిచర్యకై వందనములు".

డి. సత్యవాణి, కాకినాడ-3.

"అయ్యా మీరు టి.వి.లో ప్రకటించుచున్న వాక్యము వలన అందరి హృదయములు కదులుచున్నవి. ప్రభురాత్రి భోజనమును గూర్చి, కానుకలను గూర్చి చాల బాగుగా చెప్పారు. మీరు పంపిన బుక్సు చదివి అనేకులకు బోధించుచున్నాను. ఈ లోకంలో ఉన్నంతకాలము మీ గురించి ప్రార్థన చేస్తూనే ఉంటాను"

ఎమ్. జేమ్స్, మేడపాడు.

"బ్రదర్ జాషువా గూటం గార్కి వందనములు. అయ్యా మీ యొక్క టి.వి. కార్యక్రమములు ప్రతిశనివారము తేజ టి.వి.లో చూస్తున్నాము. ఎన్నెన్నో బైబిలు విషయములు, ఎన్నో ఆత్మీయ మర్మములు, సత్యాలు మీ ద్వారా తెలుసుకొనుచున్నాము. మీరు ప్రేమతో పంపిన పరిశుద్ధ బైబిలు గ్రంథము అందినది. చదివి ఆనందించు చున్నాము. మీకు, మీతో సహకరించి సేవ చేయుచున్న వారందరికీ మా నిండు వందనములు".

డి. వినయకుమార్, కరీంనగర్.

"అయ్యా, తమరి టి.వి. ప్రసంగములు మాకు ఎంతగానో ఉపయోగపడుచున్నాయి. ఆ ప్రసంగములు క్రమము తప్పకుండా నోట్సు వ్రాసుకొనుచున్నాము. కరెంటు కోత మాత్రం ఒక్కోసారి నిరాశ పరుస్తున్నది. తమ ప్రసంగముల నిమిత్తము తమకు శుభాకాంక్షలు తెలియ జేయుచున్నాను. ప్రసంగములలో ఒక ప్రత్యేకత రిఫరెన్సులు ఖచ్చితంగా ఇస్తున్నారు. ఈ వాక్యం ఎక్కడిది అని ఆలోచించ నక్కర్లేదు. వెతుక్కో నక్కర్లేదు. చాల మంది మీ ప్రసంగ సమయమునకు సిద్ధపడి చూచుచున్నారు. ఆ విషయం మాతో సంతోషముగా చెప్పుచున్నారు. మీకు హృదయపూర్వక వందనములు".

జి. ఇమ్మానుయేలు, రావులపాలెం.

"జాషువా గూటం గార్కి, వందనములు. మీ వాక్యం చాలా బావుంటుంది. ఈ నెల నుండి ప్రతి నెలా 200/- రూ॥లు కానుక పంపగలను. మీరు పంపిన బైబిలు కోర్సు కొరకు వందనములు. మీ కార్యక్రమం బాగా కొనసాగాలని కాంక్షిస్తూ, ప్రార్థించుచున్నాను".

**ఎమ్. శేఖర్ బాబు, హైదరాబాద్.**

ప్రతి శనివారం తేజ ఛానల్‌లో ప్రసారమయ్యే సత్యవాణి టి.వి. కార్యక్రమము ద్వారా అనేక వేల మంది ఆత్మీయంగా బలపడు చున్నారు. వందలాది ప్రజలు మారుమనస్సు, బాప్తిస్మము పొందుచున్నట్లు వ్రాయు చున్నారు. అందుకు దేవునికి స్తోత్రం. ప్రతి స్థానిక క్రీస్తు సంఘములోను సత్యవాణి రేడియో, టి.వి. కార్యక్రమ ముల నిమిత్తమై ప్రార్థించమనవి.

తేజ ఛానల్‌లో ప్రసారమయ్యే సత్యవాణి టి.వి. కార్యక్రమాలు ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 వరకు. మరియు రేడియో కార్యక్రమము ప్రతి ఆది, సోమ, బుధ గురువారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి.

మీ బంధుమిత్రులకు విన్పించండి!!

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.